క్లుప్తంగా

హామీలు అమలు చేయాలి


షాలేంకుమారి, నాగేంద్రమ్మ

దొనకొండ: ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు చిరుపల్లి అంజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆశా కార్యకర్తల సమావేశం దొనకొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనెఫిట్స్ కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని, ఆశా వర్కర్స్ తమ హక్కుల కోసం సీఐటీయూ యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. అధ్యక్షులుగా పైడిపోగు షాలేంకుమారి, ఉపాధ్యక్షులుగా యందూరి నాగేంద్రమ్మ, వడ్లమూడి రాజేశ్వరి, కమిటీ సభ్యులుగా పార బంగారమ్మ, కర్నాటి రమణ, దూపాటి రమణ, మల్లెల రమాదేవి, ఎం.అంజలీదేవి, ఎం.సునీత, సందు గోవిందమ్మ, వై.వెంకటమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దొనకొండ మండల సీఐటీయు గౌరవ అధ్యక్షుడిగా చిరుపల్లి అంజయ్యను ఎన్నుకున్నారు.

సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో సూర్యనారాయణస్వామి

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద దేవగిరి కొండపై వెలసిన శ్రీ ఛాయ సమేత సూర్యనారాయణస్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో మంగళవారం పూజలు చేశారు. రథసప్తమి సందర్భంగా అర్చకులు బాచిమంచి భరద్వాజశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జామున సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు మాట్లాడుతూ గ్రహ నాయకుడు సూర్యభగవానుడ్ని ఆరాధించడంతో సకల శుభాలు కలుగుతాయని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు నైవేద్యం తయారు చేసి స్వామికి సమర్పించారు. దాతల సాయంతో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

పోలవరంపై
కూటమి నేతల వివక్ష

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పోలవరంపై కూటమి ప్రభుత్వం కక్ష సాధిస్తోంది. పల్లెల్లో అభివృద్ధి చేయాలనుకోవడం దండగ అనుకున్నారే మోగానీ పోలవరం గ్రామంపై టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడల్లా వివక్ష చూపుతోంది. గ్రామానికి అరకొర నిధులు కేటాయించడం.. కాంట్రాక్టర్లతో పనులు మమ అనిపిస్తున్నారు. చివరకు బిల్లులు చెల్లించకుండా కాంట్రాక్టర్లను అల్లాడిస్తున్నారు. గ్రామ సభమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పోలవరం వాసులు వాపోతున్నారు. గ్రామంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల గత టీడీపీ ప్రభుత్వంలో అంతర్గత డ్రైనేజీలు నిర్మించారు. కాంట్రాక్టర్లు బిల్లులు చెల్లించడం లేదు. టీడీపీ నాయకులు కాంట్రాక్టర్‌తో అంతర్గత డ్రైనేజీ నిర్మింపజేశారు. అయితే వారికి బిల్లులు చెల్లంచడం మాత్రం మరిచారు. రూ.42 లక్షలు వరకు చేసిన పనికి బిల్లులు చెల్లించలేదని ఆ పార్టీ నాయకులే వాపోతున్నారు. దీంతో ఆ పని గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నిలిపివేశారు. నడి రోడ్డులో నిర్మించిన అంతర్గత రోడ్డులో పూర్తి స్థాయిలో పనులు జరగక పోవడంతో పైపైన వేసిన అంతర్గత డ్రైనేజీపై సీసీ రోడ్డులు వేయకుండా గత టీడీపీ ప్రభుత్వంలోనే నిలిపివేశారు. దీంతో రోడ్డు మధ్యంలో డ్రైనేజీ పైపులు లీకేజీ వచ్చి నడి రోడ్డులోనే మురుగు నీరు పారుతోంది. ఇటీవల రెవెన్యూ, మండల ప్రజాపరిషత్ అధికారులు గ్రామంలో పర్యటించారు. వారికి గ్రామస్తులు తాము పడుతున్న అగచాట్లను చెప్పుకున్నారు. అయినా ఇప్పటికీ పరిష్కారం చూపలేదు. పల్లె పండగ


అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్డు


రోడ్డుపై మురుగు

పేరుతో సంక్రాతికి గ్రామంలో రోడ్లన్నీ వేస్తామని కూటమి ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. టీడీపీ నేతలు తమ బంధువులు ఉన్న ప్రాంతాల్లో రోడ్లు వేసుకుని నిజంగా ఇబ్బందులు పడుతున్న ప్రాంతాల్లో మాత్రం రోడ్లు వేయలేదని చెప్పడానికి పోలవరం గ్రామం ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. గ్రామంలో ఇంటింటికీ జ్వర పీడితులు విష జ్వారాలతో అల్లాడుతున్నారు. వేలకు వేలు ప్రైవేటు ఆస్పత్రులకు పోసి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రోడ్డు మీదకు పారుతున్న డ్రైనేజీ నీరు నివాసాల ముందు నిలబడి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో గ్రామంలో వీధులు దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇటీవల సంక్రాంతికి సీసీ రోడ్లు వేస్తున్నామని చెప్పారే కానీ అక్కడ తట్ట మట్టి కూడా పోయలేదు. ఎంపీ నిధుల కింద రూ.20 లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.20 లక్షలు వస్తే గ్రామంలోని టీడీపీ నాయకులు సీసీ రోడ్లు వెస్తే తమకు లాభం ఏముంటుందని అనుకున్నారని అనిపిస్తోంది.

ఎస్సీల వర్గీకరణ కోసం పోరాటాలకు సిద్ధం కావాలి


సదస్సులో మాట్లాడుతున్న మేడ్ అధ్యక్షుడు దేవపాల్


ర్యాలీలో పాల్గొన్న మాదిగలు

- మేధావుల సదస్సులో ఎమ్మార్పీఎస్ నాయకుల పిలుపు

యర్రగొండపాలెం: ఎస్సీల రిజర్వేషన్లు అందిపుచ్చుకునేందుకు తమ పిల్లలను చదువుల్లో ముందుండే విధంగా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని, అప్పుడే తమ పోరాటాలకు ఫలితం ఉంటుందని మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్, గుంటూరుకు చెందిన ప్రముఖ న్యాయవాది కత్తి చలమరాజు అన్నారు. మంగళవారం స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రాం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మాదిగ మేధావుల సదస్సులో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగంలోనే లిఖించబడి ఉందని, అప్పట్లోనే బడుగు వర్గాలను దృష్టిలో పెట్టుకొని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్గీకరణ గురించి చర్చించారని పేర్కొన్నారు. 1975లో పంజాబ్‌లో వర్గీకరణ జరిగిందని, మిగిలిన రాష్ట్రాల్లో అటువంటి పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఏపీలో రిజర్వేషన్లు అనుభవిస్తున్న ఒక వర్గానికి చెందిన వారు ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరచడంలో తీవ్ర జాప్యం వహిస్తున్నారని, వెంటనే వర్గీకరణ అమలు పరిచి దేశ అత్యున్నత స్థానం ఇచ్చిన తీర్పును గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. రిజర్వేషన్లు భావితరాలవారికి ఉండకపోవచ్చని, అందుకు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి పోటీ పరీక్షల్లో ముందుండే విధంగా చూడాలన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ పిలుపు మేరకు ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు, వెయ్యి గొంతుల కార్యక్రమానికి మాదిగ మేధావుల సదస్సు ద్వారా సంఘీభావం తెలుపుతున్నామని ప్రకటించారు. రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపు ఇచ్చారు. ముందుగా స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సదస్సులో నాయకులు సింగా ప్రసాద్, చేదూరి లక్ష్మయ్య, గురవయ్య, ఉప్పలపాటి రమేష్, గంగయ్య మాదిగ, ఉప్పలపాటి నాగయ్య, పూర్ణకంటి తిరుమలయ్య, రాములు, పుల్లయ్య, సుబ్బయ్య, లూకయ్య, ఓబులు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అంకితభావంతో సేవలందించాలి


పోలీస్‌స్టేషన్‌లో మొక్క నాటుతున్న ఎస్పీ దామోదర్


వైపాలెం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ దామోదర్

- ఎస్పీ ఏఆర్ దామోదర్

పెద్దారవీడు: వృత్తి పట్ల, క్రమశిక్షణ, అంకిత భావంతో పోలీసులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. పెద్దారవీడు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, పట్టుబడిన వాహనాలు, రిసిప్షన్ కౌంటర్, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిధిలో కేసుల నమోదులు, లా అండ్ అర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, మహిళలు, చిన్నారులపై జరిగే అకృత్యాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, గస్తీ విధులు పటిష్టంగా చేపట్టాలన్నారు. తరుచూ విజిబుల్ పోలీసింగ్ చేపడుతూ నేరాలను కట్టడి చేయాలని, సైబర్ నేరాల అడ్డుకట్టకు అవగాహనే అసలైన అస్త్రమన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలపై అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. ప్రజా ఫిర్యాదుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఫిర్యాదులను పరిష్కారించాలని తెలిపారు. అనంతరం ఆవరణలో ఎస్పీ ఏఆర్ దామోదర్ మొక్కలు నాటారు. ఆయన వెంట మార్కాపురం డీఎస్పీ నాగరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఎర్రగొండపాలెం సీఐ ప్రభాకర్‌రావు, ఎస్ఐ అనిల్‌కుమార్, పోలీసులు, హోంగార్డులు ఉన్నారు.

పుల్లలచెరువు: ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తీర్చాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. పుల్లలచెరువు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ మండల పరిధిలో 45 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. స్థానికంగా జరిగే నేరాలతో పాటు గ్రామాల్లో గొడవలను నిఘా నేత్రాలు నిక్షిప్తం చేస్తాయని, కేసుల దర్యాప్తులో సీసీ కెమెరాల పుటేజీలు కీలకంగా మారుతున్నాయన్నారు. ఆయన వెంట మార్కాపురం డీఎస్పీ నాగరాజు, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సీఐ ప్రభాకర్‌రావు, పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం ఎస్ఐలు సంపత్‌కుమార్, చౌడయ్య, పోలీసులు ఉన్నారు.

యర్రగొండపాలెం: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఉన్న రికార్డులతో పాటు పరిసర ప్రాంతాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై పి.చౌడయ్యలకు పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట మార్కాపురం డీఎస్పీ నాగరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఉన్నారు.

ఖోఖో క్రీడాకారునికి ఘన స్వాగతం

ముండ్లమూరు (దర్శి): విశ్వవిజేతగా భారత జట్టులో సత్తాచాటిన ఖోఖో క్రీడాకారుడు పోతిరెడ్డి శివారెడ్డికి మండల ప్రజలు ఘనస్వాగతం పలికారు. విశ్వవిజేతగా నిలిచిన తర్వాత తొలిసారి స్వగ్రామం వస్తున్న శివారెడ్డిని ఈదర ప్రజలతో పాటు మండల ప్రజలు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాల నడుమ, విద్యుత్ లైటింగ్‌తో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై ఘన స్వాగతం పలికారు. తమ గ్రామానికి చెందిన విశ్వవిజేతకు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. తన


రథంపై వస్తున్న శివారెడ్డి

కోసం వచ్చిన అభిమానులకు అభివాదం చేసుకుంటూ శివారెడ్డి ముందుకు సాగాడు.

ఎమ్మెల్యే తాటిపర్తికి సన్మానం


ఎమ్మెల్యే తాటిపర్తిని సన్మానిస్తున్న సుల్తాన్, ఇతర నాయకులు

యర్రగొండపాలెం: ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ సుల్తాన్, అంగన్‌వాడీ శాఖ జిల్లా అధ్యక్షురాలు కనపర్తి గోవిందమ్మ మంగళవారం ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఉన్న ఆయన్ను కలిసి శాలువాలు కప్పి సన్మానించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉన్న ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నాయకులతో త్వరలో కలుస్తామని, వారి సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. వారి వెంట సింగరాయకొండ ప్రాంతానికి చెందిన నాయకులు షేక్ కరీం, అబిద్ ఆలి, అల్లాభక్షు, కరీంబాషా, జావెద్, శ్రావణి ఉన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


దర్శి: వ్యవసాయ సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త వరప్రసాద్


దొనకొండలో..


త్రిపురాంతకం: రైతులతో మాట్లాడుతున్న ఏఓ నీరజ


తాళ్లూరు: రైతులతో మాట్లాడుతున్న ఏఓ ప్రసాద్‌రావు

దర్శి: పొలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ సూచించారు. మండలంలోని కొత్తపల్లి, కొర్లమడుగు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏఓ బాలకృష్ణ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హాజరైన శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్‌రావు మాట్లాడుతూ వివిధ పంటల్లో సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. వరిలో ఉల్లికోడు నివారణ చర్యల గురించి తెలియజేశారు. మిరప పంటలో పురుగు, తెగుళ్ల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. డ్రిప్ ఉపయోగించడం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ పంట దిగుబడులు తీయవచ్చన్నారు. పప్పు దినుసులైన కంది, మినుము, పెసర సాగు చేస్తే నేలకు బలం చేకూరుతుందని చెప్పారు. వ్యవసాయ సహాయకులు డి. సునీతాబాయ్, పి.శివసుధాకర్, రైతులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: రబీలో సాగు చేసిన ప్రతి ఒక్క రైతు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి కె. నీరజ అన్నారు. మండలంలోని దుపాడు, గొల్లపల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి సాగు చేసిన మిరప, వరి పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. అనంతరం రైతు సేవ కేంద్రాల్లో గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ పంట నమోదు చేయించుకున్న రైతులు ఈకేవైసీ కచ్చితంగా వేయాలని సూచించారు. వీఏఏలు షేక్ మసూద్‌బాషా, మదాసు వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.


కురిచేడు: రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ మధుబాబు

దొనకొండ: మండలంలోని గ్రామాల్లో పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతన్న వివరాలను ఫార్మర్ రిజిష్టర్‌లో నమోదు చేసి ప్రత్యేక ఫార్మర్ ఐడీ ఇస్తామని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం రామాపురం రైతు సేవా కేంద్ర పరిధిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు. ప్రతి రైతు సిబ్బందితో సహకరించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఆధార్ నంబర్ మాదిరి ప్రతి రైతుకు ప్రత్యేక సంఖ్య కేటాయిస్తారని తెలిపారు. ప్రభుత్వం సహకారంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం గురించి రైతులకు వివరించారు. దీంతో ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల రాయితీలు, భూ ఆధారిత చెల్లింపులు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట నష్టపరిహారం, పంట రుణాల వడ్డీ రాయితీ, వ్యవసాయ పనిముట్లు అందుతాయన్నారు. మార్కాపురం ఉదాన్యవన శాఖ అధికారి రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం మిర్చి పంటలో నల్ల తామర పురుగు నివారణ చర్యలు వివరించారు. వేసవిలో నీటి వసతి ఉన్న రైతులు కూరగాయల సాగు చేపట్టాలని వివరించారు. గ్రామ రైతులు, సహాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కురిచేడు: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు సూచించారు. మండలంలోని పడమరవీరాయపాలెం, కురిచేడు రైతు సేవా కేంద్రాల పరిధిలోని పంట పొలాలను ఆయన మంగళవారం పరిశీలించారు. దీని నివారణ కోసం విత్తన శుద్ధికి కిలో విత్తనానికి 5 మిలీ సయంత్రనిలిప్రోలు 19.08 శాతం, థయోమితక్సిమ్ 19.08 శాతం ఎఫ్ఎస్ మందుతో విత్తనశుద్ధి చేస్తే విత్తిన 20–30 రోజుల వరకు పంటను కత్తెర పురుగు నుంచి కాపాడుకోవచ్చన్నారు. 30–35 రోజుల వ్యవధిలో కార్బోఫురాన్ గుళికలు ఎకరానికి 3 కిలోల సూడుల్లో లేదా మొవ్వల్లో వేసుకోవాలని సూచించారు. రబీ సీజనులో పంట సాగు చేసిన వారు ఈ నెల 15 లోపు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

తాళ్లూరు: రైతులకు పంటల్లో వచ్చే సందేహాలను నివృత్తి చేసుకునేందుకు సమీకృత రైతు సమాచార కేంద్రం టోల్ ఫ్రీ నెంబర్ 155251 ఫోన్ చేసి సందేహాలు తెలిపితే సంబంధిత అధికారులు సమాధానాలు ఇస్తారని, రైతులు ఈ అవకాశాన్ని కూడా వినియోగించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. మంగళవారం తురకపాలెం, దారంవారిపాలెం, మన్నేపల్లి ఆర్‌బీకేల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రసాద్‌రావు మాట్లాడుతూ రబీలో పంటల నమోదు ప్రక్రియ చివరి దశకు వచ్చిందని, సత్వరమే ఈ–పంట నమోదు, ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. వీఏఏ నాగమల్లేశ్వరి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ మౌనిక

తాళ్లూరు: పొగాకు, గుట్కాతో నోటి, గర్భాశయ క్యాన్సర్ వస్తాయని డాక్టర్ మౌనిక హెచ్చరించారు. తూర్పు గంగవరం పీహెచ్‌సీలో ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా ఆశ వర్కర్లకు, హాస్పిటల్ సిబ్బందికి క్యాన్సర్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. రోజూ ఇంటింటా తిరిగి వైద్య పరీక్షలు చేసి క్యాన్సర్‌పై అవగాహన కల్పించి ప్రజలకు ధైర్యం నింపేలా చేయాలని సూచించారు. మలేరియా, డెంగీ రాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ శివారెడ్డి సూచించారు. డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శివారెడ్డి, హెచ్ఈఓ చంద్రశేఖర్‌రావు, హెచ్వీ సుశీల, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు


గాయపడిన మరియదాసు

కురిచేడు: మండలంలోని పొట్లపాడు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి గాయాలైన సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. వివరాలు.. దొనకొండ మండలం బాదాపురం గ్రామానికి చెందిన వైదన మరియదాసు తన ద్విచక్ర వాహనంపై బాదాపురం నుంచి విజయవాడకు వెళ్తున్నాడు. పొట్లపాడు సమీపంలో వాహనం అదుపుతప్పి పడిపోయి మరియదాసు కుడికాలు విరిగింది. 108 సిబ్బందికి సమాచారం అందించడంతో దొనకొండ సిబ్బంది ఎం.ప్రసాదరావు, ప్రసాద్ వచ్చి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వినుకొండకు తరలించారు.

సచివాలయ సిబ్బందిపై సబ్ కలెక్టర్ ఆగ్రహం

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువు సచివాలయాన్ని మంగళవారం మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అ సమయంలో సచివాలయంలో విధులు నిర్వహించాల్సిన సిబ్బంది ఎవరూ లేకపోవడంతో అగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ వసంతరావునాయక్‌తో ఫోన్‌లో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కార్యాలయంలో సిబ్బంది ఎందుకు లేరని, ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన వారు ఇలా విధులకు దుమ్మా కొట్టడంపై ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. విధులకు హాజరు కాని సిబ్బందికి షోకాజు నోటీసులు వెంటనే జారీ చేయాలని ఎంపీడీఓను సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ అదేశించారు.


ఎంపీడీఓతో ఫోన్‌లో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

వాలీబాల్ పోటీల్లో దోర్నాల విద్యార్థుల ప్రతిభ

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు షేక్ అర్ఫద్‌బాషా, షేక్ రఫీ, షేక్ అబ్దుల్ కపిల్‌లు అండర్–19 విభాగంలో జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబర్చి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జనవరి 28 నుంచి 30వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించి స్వర్ణ పతకాన్ని సాధించడంపై విద్యార్థులను ప్రధానోప్యాయుడు నారాయణరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు రామానాయక్, హెచ్ రామానాయక్, యోగా మాస్టర్ మహేశ్వరరెడ్డి, స్టాఫ్ సెక్రటరి నాగమూర్తి, విజయ మాణిక్యం, మీటేనాయక్, వెంకట శివకుమారి, పోలయ్య, చంద్రమౌళి, ఆంజనేయులు, అవులయ్య, రమణమ్మ అభినందనులు తెలిపారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు